నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, ఆదివారం 12 జనవరి 2025 HYDERABAD


## రేపు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం



సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ప్రాజెక్టు ఫేస్- 2 పరిధిలోని కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు పలు చోట్ల భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు పనులు జరుగుతాయి. దీంతో ఓ అండ్ ఎం డివిజన్-6 ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, బోరబండ, కేబీపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, నిజాంబపేట, హైదర్‌నగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, దీప్తి శ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్, హఫీజ్‌పేట్, బీరంగూడ, అమీన్‌పూర్, బొల్లారం ప్రాంతాల్లో 24 గంటల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని అధికారులు తెలిపారు.

## వాటర్ ట్యాంకర్ డెలివరీలో జాప్యం ఉండొద్దు



సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : వచ్చే వేసవి కాలం దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి సరఫరాలో జాప్యం ఉండొద్దని, వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలను రూపొందించాలని వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తట్టిఖానా సెక్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ట్యాంకర్ డెలివరీ, వెయిటింగ్ పీరియడ్, పెండెన్సీ తగ్గించేలా ప్రణాళికలు ఉండాలన్నారు. సకాలంలో ట్యాంకర్ డెలివరీ చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. హాస్టళ్లు, హాస్పిటళ్లు, హోటళ్లు, మాల్స్ తదితర వినియోగదారులతో అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. రాత్రి సమయంలోనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సెక్షన్ పరిధిలో 20 ట్యాంకర్లు ఉండగా, రోజుకు 150 ట్రిప్పులను డెలివరీ చేస్తుండగా, ఏప్రిల్ నాటికి 400 ట్రిప్పులకు పెంచేలా ఫిల్లింగ్ స్టేషన్లు, ట్యాంకర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఏకంగా 1.70 లక్షల ట్యాంకర్ల నీటిని డెలివరీ చేసినట్లు అధికారులు తెలిపారు.






సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలో నిర్వహించే అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, అధికారులు, నాయకులు, కళాకారులు, యువతీ, యువకులు, విదేశీయులు పాల్గొన్నారు.

# సంక్రాంతి బాదుడు

పోటాపోటీగా వసూళ్లు చేస్తున్న ట్రావెల్స్, క్యాబ్స్

15 వందల టికెట్.. 4,500 వరకు వసూలు

ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులున్నా.. బస్టాండ్‌ల్లో కనిపించని వైనం

తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగకు సొంతూరుకు వెళ్లడానికి బస్సులో సీటు కావాలన్నా.. క్యాబ్స్‌ల్లో ఎక్కించుకోవాలన్నా.. టికెట్ ధరల పోటీల్లో పాల్గొనాల్సిందే. ఔను రెండు, మూడింతలు టికెట్ ధరలు పెంచి ప్రయాణికుల నడ్డీ విరుస్తున్నారు. ఓవైపు ప్రత్యేక బస్సుల పేరుతో ఆర్టీసీ టికెట్ ధరలను పెంచితే.. మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ ఇబ్బడి ముబ్బడిగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేద్దామనుకునే వారికి నిరీక్షణ తప్పకపోవడంతో వాళ్లంతా ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఎటు చూసినా ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. 300 రూపాయల టికెట్ రూ.500 వరకు బస్సుల్లో పెరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. మరోవైపు ఇదే ప్రయాణం క్యాబ్‌లో 12-15వందల వరకు ఉందని తెలిపారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రికి టికెట్ ధర రూ.1500 మించదు. కానీ ట్రావెల్స్‌లో రూ. 3వేల నుంచి 4,500 వరకు వసూలు చేస్తున్నారు. తప్పనిసరిగా ఊరెళ్లాలనే సందర్భం కావడంతో వాళ్లడిగినంత ఇస్తూ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఆర్టీసీ బస్సులు ఉన్నప్పటికీ 40 నిమిషాల నుంచి గంటన్నర వరకు ఒక బస్సు అందుబాటులోకి వస్తున్నది. దీంతో అంత సమయం నిరీక్షించలేక ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఇంకోవైపు ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో రద్దీని తలపిస్తున్నాయి. మొత్తంగా సంక్రాంతి పండుగ దృష్ట్యా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, శివారు బస్ బేలు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ఎయిర్‌పోర్ట్ కూడా ప్రయాణికుల రద్దీని తలపిస్తున్నది. బస్సులు, రైళ్లలో సీట్లు అందుబాటులో లేకపోవడంతో చాలా మంది విమానాలను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గన్నవరం, రాజమండ్రి, వైజాగ్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుండటంతో పలు ఫ్లైట్ల టికెట్ ధరలను కూడా పెంచేశారు. రాజమండ్రి వెళ్లాలంటే సుమారు 15వేల వరకు ఖర్చు అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

### ఆర్టీసీ ఆలస్యమే..

ఆర్టీసీ బస్సులు ప్రయాణికుల ఓపికను పరీక్షిస్తున్నాయి. సంక్రాంతి దృష్ట్యా 6వేలకు పైగా బస్సులు అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు.. కానీ బస్సులు మాత్రం సమయానికి రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జేబీఎస్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ స్టేషన్లతో పాటు నగర శివారు బస్ బేలు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో చాలా మంది ప్రయాణికులు నిల్చొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్డినరీ బస్సులు సైతం ఉచిత బస్సు స్కీంతో మహిళలతో కిక్కిరిపోతున్నాయి. బస్టాండ్‌ల్లోనే బస్సులు ఫుల్ కావడంతో ఆ బస్సులు నగర శివార్లకు వెళ్లేసరికి అక్కడి ప్రయాణికులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు ట్రావెల్స్‌పై రవాణా శాఖాధికారులు కేసులు నమోదు చేశారు. అధిక ధరలు వసూలు చేసినా.. ట్రావెల్స్‌లో పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకున్నా కేసులు నమోదు చేస్తామని అధికారులు చెప్పారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

### రోడ్డెక్కిన వేలాది కార్లు.. ట్రాఫిక్ సమస్య..

వేలాది కార్లు రోడ్డెక్కాయి. ఇక నగరమంతా సొంతూరుకు కదలడంతో హైవేలన్నీ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉప్పల్, కూకట్‌పల్లి, దిల్‌షుక్‌నగర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. విజయవాడ-హైదరాబాద్ హైవే వాహనాల రద్దీతో కిటకిటలాడింది. చౌటుప్పల్ చౌరస్తాలో అండర్ పాస్ పనులతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గంటకు 30-40 కిలో మీటర్ల వేగం కూడా కార్లు వెళ్లలేకపోతున్నాయి. టోల్ గేట్ల వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు స్తంభించిపోయాయి. నగరవాసికి ఇల్లు చేరుకోవడానికి తీవ్ర నరకం చూడాల్సి వచ్చిందని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రయాణ కష్టాలను పంచుకోవడం విశేషం.



ప్రయాణికులతో కిక్కిరిసిన జేబీఎస్

# ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి

రెండు రైళ్లు ఒకే పట్టాలపై వచ్చినా..

30 మీటర్ల దూరంలోనే నిలిచిపోతాయి

రైళ్లు ఢీకొనే అవకాశమే లేదు

హైదరాబాద్ మెట్రోలో రక్షణ కవచంగా సీబీటీసీ

ఒకే ట్రాక్‌పై రెండు మెట్రో రైళ్లు ..వీడియో వైరల్

సీబీటీసీతో ప్రమాదాలకు ఆస్కారమే లేదని స్పష్టతనిచ్చిన హెచ్ఎంఆర్ఎల్



**సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ) :** హైదరాబాద్ మెట్రో రైళ్లు ఒకే పట్టా మీదకు వస్తే ఎలాంటి ప్రమాదం జరుగుతుంది...ఇప్పుడు ఇదే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన సంఘటనలో రెండు రైళ్లు ఒకే పట్టాలకు మీదకు వచ్చిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. అయితే ఇదే కనుక జరిగితే మెట్రో ప్రయాణం నిజంగా సురక్షితమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా ఒకవేళ అలా వచ్చిన సందర్భంలో రెండు రైళ్లు ఢీకొనే అవకాశం ఉంటుందా? ఢీకొడితే ఏ మేరకు ప్రమాదం జరుగుతుంది.? ఇంజన్ ప్రమేయం లేకుండా నిలిపివేసే అవకాశం ఉందా అనే అనుమానాలను నివృత్తి చేస్తూ హెచ్ఎంఆర్ఎల్ వినియోగించిన అధునాతన టెక్నాలజీ స్పష్టతనిచ్చారు. మెట్రో రాకపోకల సమాచారం ఆధారంగా పనిచేసే సాంకేతికత విధానం ద్వారా అసలు ఢీకొనే అవకాశమే లేదని చెబుతున్నారు. అలాంటి సందర్భం ఎదురైనా... రెండు మెట్రో రైళ్ల మధ్య కనీస దూరం 30-50 మీటర్ల దూరం ఉండేలా ప్రయాణిస్తాయని చెబుతున్నారు. దీనికోసం దేశంలోని తొలిసారిగా కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్(సీబీటీసీ) విధానాన్ని వినియోగించినట్లు చెబుతున్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఎలాంటి ప్రమాదం ఉండదని, ఢీకొనేందుకు అవకాశమే ఉండదని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

### దేశంలోనే తొలిసారిగా..

దేశంలోనే తొలిసారిగా ఎలివేటెడ్ కారిడార్ విధానాన్ని పీపీపీ విధానంలో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోకు చోటు దక్కింది. అయితే నిర్మాణ దశ నుంచి మెట్రో రైలు పట్టాలెక్కేంత వరకు వినియోగించిన సాంకేతికతపై మొదటి నుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అసలు మెట్రో రైలు ప్రయాణం సురక్షితమేనా? రెండు మెట్రో రైళ్లు ఢీకొంటాయా.. అనే అనుమానం ఇప్పటికీ ఉంది. కానీ గడిచిన ఏడేండ్లలో ఏనాడూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండానే రాకపోకలను మెట్రో సంస్థ నిర్వహించింది. ఇదేలా సాధ్యమనే ప్రశ్నలకు సమాధానంగా... మెట్రో రైల్ రాకపోకలను నియంత్రించే సీబీటీసీ విధానంతోనే వీలు పడుతుందని, దీంతోనే ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా రైళ్ల ప్రయాణం ఉంటుందని చెబుతున్నారు.

### 30 మీటర్ల దూరంలో ఆగేలా..

సాంకేతిక, మానవ తప్పిదాల దృష్ట్యా ఒకసారి రెండు రైళ్లు ఒకే పట్టాల మీదకు వస్తే గనుక ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలనే దానిపై మొదటి నుంచి చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా సీబీటీసీ టెక్నాలజీని మెట్రో సంస్థ వినియోగంలోకి తీసుకువచ్చింది. ఉప్పల్‌లోని ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ ద్వారా నియంత్రించగలిగే వ్యవస్థను రూపొందించారు. దీని ద్వారా మానవ, యాంత్రిక తప్పిదాలకు తావు లేకుండా మెట్రో రాకపోకలు సాగించే వీలు ఉంటుందని మెట్రో ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ రెండు రైళ్లు ఒకే పట్టా మీదకు వచ్చినా.... కూడా కనీసం 30 మీటర్ల దూరంలోనే ఆటోమేటిగ్గా నిలిచిపోయేలా గార్డ్ రైల్ టెక్నాలజీ పనిచేస్తుందని చెబుతున్నారు. దీంతో ఏమాత్రం రెండు ఇంజన్లు ఢీకొనే అవకాశం ఉండదంటున్నారు. పీక్ అవర్స్‌లో తక్కువ సమయంలోనే రెండు, మూడు రైళ్లు ఒకే పట్టాల మీదకు వచ్చే సందర్భాలను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైల్ నిర్వహణ జరిగినట్లు చెబుతున్నారు. ఇదే ప్రయాణికులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని, దీంతో రెండు మెట్రో రైళ్లు ఢీకొనకుండా నియంత్రించగలిగే సామర్థ్యం దేశంలోని ఏ మెట్రో రైలుకు లేదని మెట్రో వర్గాలు పేర్కొన్నాయి. ఎలివేటెడ్ మెట్రో కారిడార్ ప్రమాదాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ అన్ని మెట్రో రైళ్లకు ఆదర్శంగా నిలుస్తుందని ఇటీవల జరిగిన ఓ సమావేశంలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కూడా స్పష్టం చేశారు.

# అయ్యో పాపం..

## వేడినీళ్లు మీదపడి చిన్నారి మృతి

శేరిలింగంపల్లి, జనవరి 11: వేడినీళ్లు మీదపడి కాలిన గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతూ ఓ చిన్నారి చనిపోయాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ శివపురికాలనీకి చెందిన మైస రాజు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య సోని, కుమారుడు ధీరజ్‌తో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 6న రాజు కారు డ్రైవింగ్‌కు వెళ్లాడు. సాయంత్రం భార్య సోని స్నానం చేసేందుకు హీటర్‌తో బకెట్‌లో వేడినీళ్లు పెట్టింది. నీళ్లు వేడయ్యాక హీటర్ వైర్ తీసి బాత్ రూంలో పెట్టేందుకు వెళ్లింది. అదే సమయంలో అక్కడ ఆడుకుంటున్న కుమారుడు ధీరజ్ (4) వేడినీళ్ల బకెట్ వద్దకు చేరుకొని వంచడంతో వేడినీళ్లు మీదపడ్డాయి. తీవ్ర కాలిన గాయాలతో విలవిలలాడుతున్న ధీరజ్‌ను.. చికిత్స కోసం నిలోఫర్ దవాఖానకు తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ధీరజ్ 60 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.



ధీరజ్ (ఫైల్)

# వసతుల కల్పనకు నిధులేవీ?

మున్సిపాలిటీలకు నిధుల మంజూరీలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఆస్తిపన్నులు, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లపైనే ఆధారపడిన మున్సిపాలిటీలు

మేడ్చల్, జనవరి11(నమస్తే తెలంగాణ): నిధుల లేమితో శివారు మున్సిపాలిటీలు వసతుల కల్పనకు నోచుకోవడం లేదు. ప్రజలకు సౌకర్యాలను కల్పించడంలో మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరీలో నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో మున్సిపాలిటీల పరిధిలో అనేక సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రజలు ఫిర్యాదులు చేసినా.. సమస్యలు పరిష్కరించేందుకు నిధుల సమస్య ఏర్పడుతున్నది. దీంతో మున్సిపాలిటీల్లో నిధుల సమస్యలు రాకుండా ఉండేందుకు వంద శాతం ఆస్తిపన్నుల, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఆదాయం పెంచుకునేలా మున్సిపల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో వంద శాతం పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఆదాయాన్ని పెంచేలా దృష్టి సారిస్తున్నారు.

### ట్రేడ్ లైసెన్స్‌ల పై ప్రత్యేక దృష్టి..



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 13 మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఇందులో అనేక వ్యాపారాలు సముదాయాలు ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలను నిర్వహించుకుంటున్నారు. అయితే ట్రేడ్ లైసెన్స్‌లు లేని వ్యాపార సముదాయాలపై చర్యలు తీసుకునే విధంగా మున్సిపల్ అధికారులు తనిఖీలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే వ్యాపార సముదాయాలు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా ఉండటం మూలంగా మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయం కోల్పోతున్నది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మున్సిపాలిటీలను నిధులు మంజూరు చేయకపోవడంతో ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఆదాయం పొందాలని చూస్తున్నారు.

### పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 182 కోట్లు..

జిల్లాలోని 13 మున్సిపాలిటీలు 34 గ్రామ పంచాయతీలలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 182 కోట్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు పన్ను వసూళ్లలో 60 శాతం మాత్రమే వసూళ్లు జరిగాయి. మున్సిపాలిటీలలో రూ. 172 కోట్లు ఉండగా, గ్రామ పంచాయతీల్లో రూ. 10,76 కోట్లు ఉన్నాయి. మున్సిపాలిటీలలో నిధుల లేమితో తప్పని సరిగా ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. మున్సిపాలిటీలలో కనీస అవసరాలను కల్పించేందుకైనా ఆస్తిపన్నుల, ట్రేడ్ లైసెన్స్‌లపై మున్సిపాలిటీలు ఆధారపడాల్సి వస్తున్నది. ఏదీ ఏమైనా నిధుల లేమితో మున్సిపాలిటీల అభివృద్ధి జరగడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# చిరు వ్యాపారులు రోడ్డుపాలు..

ఎర్రకుంట వద్ద తెల్లవారుజామున డబ్బాల తొలగింపు

జీవనోపాధి కోల్పోవడంతో కన్నీరుమున్నీరైన బాధితులు

మా ప్రాణాలు పోయేవి : బాధితురాలు రేణుక

బాధితులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు

బండ్లగూడ: పొట్ట చేత పట్టుకుని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి చిరు వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. తెల్లవారే సరికి వారి డబ్బాలను కూల్చివేయడంతో వారంతా రోడ్డున పడ్డారు. దీంతో వారు తమ బాధలను ఎవరికీ చెప్పుకొవాలో అర్థం కాక కన్నీరుమున్నీరయ్యారు. 20 ఏండ్లుగా తాము ఇక్కడ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట వద్ద కొన్నేండ్లుగా చిరు వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున కార్పొరేషన్ అధికారులు వచ్చి ఎర్రకుంట వద్ద ఉన్న డబ్బలను తొలగించారు. సూర్యోదయానికి డబ్బలను పూర్తిగా తొలగించారు.దీంతో బాధితులు అక్కడికి చేరుకొని.. కన్నీరు పెట్టుకున్నారు. ముందస్తుగా సమాచారం ఇచ్చి ఉంటే అందులో ఉన్న సామగ్రిని తీసుకునే వారమని ఆవేదన చెందారు.

### మా ప్రాణాలు పోయేవి : రేణుక

ఎర్రకుంట వద్ద హైదర్షాకోట్ గ్రామానికి చెందిన రేణుక భర్త చనిపోవడంతో పంక్చర్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నది. ఆమె తన ముగ్గురు పిల్లలతో కలిసి రాత్రి అక్కడే నిద్రించింది. ఒక్క సారిగా తెల్లవారు జామున జరిగిన అలజడికి ఆమె బయటకు వచ్చి చూసే సరికి ఆమె ఉన్న డబ్బా పక్కనే ఉన్న డబ్బాను తొలగించడం కనిపించింది. దీంతో ఆమె అరుపులు విన్న అధికారులు ఆమెకు ఒక రోజు సమయం ఇచ్చి వెళ్లిపోయారు. తనకు మేలుకువ రాకపోతే తాము ఇప్పటికే చనిపోయేవారమని రేణుక రోదించింది.

### బీఆర్ఎస్ నాయకుల నిరసన

అధికారుల చర్యలతో జీవనోపాధి కోల్పోయిన బాధితులకు అండగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిలిచారు. కార్పొరేషన్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎర్రకుంట వద్దకు వచ్చి బాధితులతో కలిసి నిరసన తెలిపారు. అధికారులు కాంగ్రెస్ నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారి.. ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రకుంట వద్ద అనేక సంవత్సరాలు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై అకస్మాత్తుగా విరుచుకుపడి వ్యాపార సముదాయాలను కూల్చి వేయడం ఎంత వరకు సమంజసమన్నారు.





ఎర్రకుంట వద్ద కూల్చివేసిన డబ్బాలు.. బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# మద్యం కోసం.. ఫోన్ తాకట్టు పెడితే..

## ఫోన్ విషయమై గొడవ..హత్య

మియాపూర్: మద్యం తాగేందుకు డబ్బుల్లేక తాకట్టు పెట్టిన ఫోన్‌ను విడిపించేందుకు నెలకొన్న వివాదంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. మియాపూర్ ఠాణాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మియాపూర్ సీఐ క్రాంతి, మాదాపూర్ ఎస్వోటీ సీఐ సంజయ్‌కుమార్‌లతో కలిసి మియాపూర్ ఏసీపీ నర్సింహారావు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన కేశవ్ బంగార్(39 ) స్వరాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీలో పని చేశాడు. ఉపాధి నిమిత్తం 15 రోజుల కిందట మియాపూర్ ఠాణా పరిధిలోని హఫీజ్‌పేట్‌కు వచ్చాడు. హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నివసిస్తూ లేబర్ అడ్డాలో పని కోసం వెళ్తున్నాడు. అదే అడ్డాలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సహచర కూలీలు గందె సునీత్(23), సునీల్ మద్దానికర్(25), ప్రేమ్ సాగర్ నోడ్గి (24) పరిచయమయ్యారు. ఈ నెల 4న మద్యం తాగేందుకు సునీత్, మద్దానికర్ వద్ద డబ్బులు లేకపోవడంతో కేశవ్ బంగార్ ఫోన్‌ను తాకట్టు పెట్టి డబ్బులు తేవాలని, తదుపరి విడిపించి ఇస్తామన్నారు. అదే ప్రకారం డబ్బులు తేగా అందరూ కలిసి మద్యం సేవించారు. అదే రోజు సాయంత్రం రైల్వే స్టేషన్ సమీపంలో మద్యం సేవిస్తున్న సునీత్, మద్దానికర్‌ను కేశవ్ తాగిన మైకంలో తన ఫోనును విడిపించి ఇప్పించాలని గొడవపడ్డాడు. తమ సహచర మరో కూలీ అయిన ప్రేమ్ సాగర్ నోడ్గిని సైతం అక్కడికి పిలుపించుకోగా...ముగ్గురి మధ్య తీవ్ర వివాదం చోటు చేసుకుని వారిపై దాడి చేశాడు. ఈ నేపథ్యంలో సునీత్, మద్దానికర్, నోడ్గి కేశవ్ సాగర్‌పై సిమెంటు ఇటుకతో దాడి చేశారు. ఈ నేపథ్యంలో కేశవ్ తలపై తీవ్ర రక్తస్రావమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు.. కేశవ్ బంగార్‌ను సునీల్, మద్దానికర్, ప్రేమ్‌సాగర్ హత్య చేసినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. హంతకులను కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న మియాపూర్ ఏసీపీ నర్సింహారావు